క్లుప్తంగా

జాషువాకు ఘన నివాళి



కాజీపేట: మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలను కాజీపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు జన్ను సాంబయ్య, మండల నాయకులు తిక్క సాంబయ్య, రేఖ, రజిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ యువతకు ఆదర్శం



ఖిలా వరంగల్: మతోన్మాద శక్తులను ఓడించడమే లక్ష్యంగా పోరాడిన భగత్ సింగ్‌ను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్‌వలీ ఉల్లా ఖాద్రీ సూచించారు. వరంగల్ కరీమాబాద్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు సుధీర్, లాదెళ్ల శరత్, యాకూబ్‌పాషా, జగదీష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

కేయూ క్యాంపస్: భగత్‌సింగ్ స్ఫూర్తితో సమస్యలపై పోరాటాలు చేస్తామని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ 118వ జయంతిని కేయూ మొదటి గేట్ వద్ద ఆదివారం నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేయూ పరిశోధక విద్యార్థులు కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి, నాగరాజు, పీఎస్ఎఫ్ఐడీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, మామిడిపల్లి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖండాంతరాలు దాటిన బతుకమ్మ

హన్మకొండ: బతుకమ్మ సంస్కృతి ఖండాంతరాలు దాటిందని కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్ అన్నారు. అమెరికాలోని న్యూజెర్సీలోని రాయల్ అల్బర్ట్ ప్యాలెస్‌లో మన అమెరికా తెలుగు సంఘం (మాటా) ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ మహిళలు 8 అడుగుల బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి ఉట్టి పడేలా బతుకమ్మ పండుగను అమెరికాలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామల ప్రదీప్, చిన్నాల రాము, కొండ ప్రభాకర్, బాలాజీ, మహిళలు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

వరంగల్ అర్బన్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు 19వ డివిజన్‌లో ఆదివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు జిల్లా అధ్యక్షురాలు నూకల రాణి తెలిపారు.

కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్



హసన్‌పర్తి: ఒకటో డివిజన్ ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలోని పద్మావతినగర్ కాలనీ అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీ కమిటీ ఎన్నికలు జరగగా, ప్రధాన కార్యదర్శిగా తోట కిరణ్, కోశాధికారిగా నరోత్తంరెడ్డిని ఎన్నుకున్నారు.

వృద్ధుడి అదృశ్యం



మడికొండ: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మడికొండ పోలీసుస్టేషన్ పరిధి అయోధ్యపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన దొంగల కొంరయ్య యాదవ్ (76) శనివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కొంరయ్య కుమారుడు దొంగల సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

భద్రకాళి అమ్మవారి సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రామన్నపేట: వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం సేవలందించినట్లు ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు తెలిపారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, చిన్నపిల్లలు, వృద్ధులకు అమ్మవారి దర్శనంలో ఇబ్బంది కలుగకుండా వలంటీర్లు సేవలందించారని పేర్కొన్నారు. వారి సేవలను దేవస్థానం ఈఓ సునీత, ధర్మకర్త రాములు అభినందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, సాత్విక్, సాకేత్, చిరంజీవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప దందా

- మామూళ్ల మత్తులో అధికారులు ?
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు
- అనుమతులు లేకుండానే అక్రమంగా తరలింపు





ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప, వరంగల్ నగర శివారులో డంపు చేసిన కలప

న్యూశాయంపేట: జిల్లాలో అక్రమ కలప దందా వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతుల పొలాలు, గట్లపై, బీడు, ప్రభుత్వ భూముల్లో ఏపుగా పెరిగిన విలువైన చెట్లను నరికి పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ అధికంగా కలప వ్యాపారులు లాభాలు దండుకుంటున్నారు. వాల్టా చట్టం ప్రకారం చెట్టు నరకాలంటే అటవీ, రెవెన్యూ, సంబంధిత గ్రామపంచాయితీ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కలప వ్యాపారులు ఇవేమి పట్టించుకోకుండా అటవీశాఖ, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ముట్టచెబుతూ వారి అండదండలతో యథేచ్ఛగా చెట్లు నరుకుతూ పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కలప రవాణా అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు తమకేమి పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు, పర్యావరణ పరిరక్షకులు ఆరోపిస్తున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు!

పర్యావరణ పరిరక్షణ, చెట్ల నరికివేతను అరికట్టడానికి, అటవీ ప్రాంతాలను పెంచడానికి, అడవిని ప్రోత్సహించడానికి వాల్టా చట్టం ఉన్నా అది అక్రమార్కులకు చుట్టంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల మత్తులో అధికారులు ఉండడంతో చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారనే ఆరోపణలు సైతం లేకపోలేదు. పంటలు పండించడానికి, పశుగ్రాసం పెంచడానికి అటవీ భూములను వ్యవసాయ భూములుగా అక్రమార్కులు మారుస్తున్నారు. అటవీ సంపద లేకపోవడంతో వాయుకాలుష్యం పెరుగుతుంది. గృహ నిర్మాణాల కోసం పెరుగుతున్న జనాభాకు గృహావసరమైన కలపకోసం చెట్లను నరికేస్తున్నారు. చెట్ల నరికివేతను ఆపడానికి ప్రతీఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. చెట్లను నరికివేయడంతో పర్యావరణం, మానవ జీవితాలపై తీవ్ర ప్రభావాలు పడతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల నరికివేతతో నష్టాలు

వృక్షాలు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. దీంతో పర్యావరణ సమతుల్యత ఉంటుంది. లేదంటే జంతువులు, పక్షుల ఆవాసాలు నాశనం అవడంతోపాటు మానవ జీవనం అస్తవ్యస్తం అవుతుంది. ఇప్పటికే అనేక జీవరాశులు కనుమరుగయ్యాయని, వాతావరణాన్ని సంరక్షించే చెట్లను నరికితే మరింత ముప్పు తప్పదని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. చెట్ల వేర్లు నేలను పట్టి ఉంచుతాయి. వాటిని నరికివేయడంతో వర్షపు నీరు, గాలి వల్ల నేల కోతకు గురై భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉంది. చెట్ల నరివేతతో వర్షాలు కూడా తగ్గుతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని చెబుతున్నారు. కానీ, ఇవేవీ పట్టించుకోని అక్రమార్కులు మాత్రం తమ వ్యాపారమే ముఖ్యం అన్నట్లుగా చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



శాంభవి నిత్యగా..



కాత్యాయనిగా..



శారదాదేవి అలంకరణలో..



భవానీదేవి అలంకరణలో..

హన్మకొండ కల్చరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శాంభవి నిత్యగా ఆదివారం అలంకరించి మహావద్రేశ్వరి క్రమంలో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

కాత్యాయని అలంకరణలో పద్మాక్షి దేవి

హన్మకొండ అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో పద్మాక్షిదేవి.. కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు దేవాలయ వంశపారంపర్య అర్చకుడు నాగిళ్ల శంకర్ శర్మ తెలిపారు. ఉదయం అమ్మవారికి షోడశ కలశాలతో పంచకాలతో అభిషేకం నిర్వహించి అలంకరించినట్లు వివరించారు. అలాగే, అనంతరం చండీహోమం జరిపించినట్లు పేర్కొన్నారు. దాతలు రామక శ్రీనివాస్ – వాణి దంపతులు, పింగిళి పవన్‌రెడ్డి – శ్రీలత దంపతులు పూజా కార్యక్రమాలు, చండీహోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు మహాఅన్నదానం చేశారు. అనంతరం శంకర శర్మ మాట్లాడుతూ సోమవారం రోజు పండుగ నిర్వహించుకోవాలని సూచించారు.

ప్రత్యేక అలంకరణలో శారదాదేవి

రామన్నపేట: నగరంలోని శృంగేరి శంకర మఠంలో శారదాదేవికి ఆదివారం ఉదయం గోపూజ, సంకల్పం, గణపతి పూజల అనంతరం ప్రత్యేక అలంకరణ చేసినట్లు శంకరమఠం ప్రధానార్చకుడు సంగమేశ్వర జోషి తెలిపారు. దాతలు రామగోవర్ధన్ – రాజకుమారి దంపతుల ఆధ్వర్యంలో సుదర్శన హోమం జరిపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, బలరాం మిశ్రా, సోమేశ్వర శర్మ, శంకర సేవా సమితి సభ్యులు, భక్తులు, సేవకులు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శారదాదేవి సోమవారం భక్తులకు వీణధారిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు సంగమేశ్వర జోషి తెలిపారు. మధ్యాహ్నం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

భవానీదేవి అలంకరణలో లలితాదేవి

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలోని లలితాదేవి అమ్మవారిని భవానీదేవిగా ఆదివారం అలంకరించారు. కార్యక్రమంలో వొడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, శ్రీరాం రాజేష్, ఆడెపు శ్యామ్, బత్తుల నవీన్, కుడికాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మార్గదర్శకులుగా నిలవాలి



మాట్లాడుతున్న బాలథెరిస్సా జింగ్రాస్

కాజీపేట రూరల్: నేటి ఆధునిక సమాజంలో యువత ప్రపంచ మార్గదర్శకాలుగా నిలవాలని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ట్రైనింగ్ సెంటర్‌లో జన వికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో యువతలో వ్యక్తిత్వ వికాసంపై రాష్ట్ర స్థాయి యువజన మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో యువత ప్రభలంగా ఉందని, సరైన దిశలో వాడుకున్నట్లయితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగిరెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ యువత ఒక చేంజ్‌మేకర్‌గా రూపొంది సమాజంలోని రుగ్మతలను రూపుమాపాలని సూచించారు. అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చల్లా సుంకు బాలచంద్ర మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనిస్తూ కలలను సాకారం చేసుకోవాలన్నారు. అనంతరం, 700 మంది పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, ట్రావెల్ బ్యాగులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన 90 మంది మెరిట్ విద్యార్థులకు రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను జన వికాస సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్లు రమణగుప్తా, మర్రెడ్డి, సోఫార్ డైరెక్టర్ సింగారెడ్డి శోభ, కెనడా దేశస్తులు బెర్నార్డ్, మోనిక్, ఎస్ఐటీజీ రవికుమార్, ఇసీఇ హెచ్‌ఓడీ పి.రవికుమార్, బాలవికాస ప్రోగ్రాం మేనేజర్లు లత, సునీత, మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

సద్దులు, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద చేస్తున్న ఏర్పాట్లు

న్యూశాయంపేట: 14వ డివిజన్ ఏనుమాముల సమీపంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్ తెలిపారు. చెరువు వద్ద ఉత్సవాల నిర్వహణ కోసం గ్రౌండ్ లెవెలింగ్, విద్యుత్ లైట్ల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను చెరువు వద్ద జరుగుతున్నాయని, ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 30న సద్దుల బతుకమ్మ, 2న దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామన్నపేట: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామన్నపేట: నగరంలోని సీకేఎం కళాశాలలో 1991–94వ సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల అనంతరం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

మడికొండ ప్రభుత్వ పాఠశాలలో..

మడికొండ: కాజీపేట మండలం మడికొండ ప్రభుత్వ పాఠశాలలో 1996 – 1997లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.



సమ్మేళనంలో ఎన్ఎస్ఎస్ పూర్వ వలంటీర్లు

ఎన్ఎస్ఎస్ పూర్వ వలంటీర్ల సమ్మేళనం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సమ్మేళనంలో హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, కేడీసీ రిటైర్డ్ అధ్యాపకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పూర్వ విద్యార్థి, జబర్దస్త్ ఫేం డాక్టర్ రాజమౌళి, పూర్వ విద్యార్థులు మానుకోట ప్రసాద్, మల్లేష్, బండ వెంకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.



మడికొండ: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

భద్రకాళి అమ్మవారికి రథోత్సవం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం అమ్మవారిని భవానీమాతగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని కాత్యాయనీ క్రమంలో దుర్గార్చన జరిపారు. సాయంత్రం చండముండహా క్రమంలో దుర్గార్చన జరిపి రథోత్సవం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ.. దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ ఈఓ రామల సునీత, అర్చకుడు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అంతకు ముందు యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు దంపతులు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ఈఓ రామల సునీత, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, రాములు, శ్రవణ్‌రెడ్డి, పూర్ణచందర్, క్రాంతి, సతీశ్, మయూరి, స్రవంతి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మూగ శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు పురస్కారం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ లష్కర్‌బజార్ ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సీహెచ్.రాములును హనుమకొండలోని ప్రెస్‌క్లబ్ హాల్‌లో భువన సుస్వర మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విజయదశమి నంది పురస్కారాల ప్రదానోత్సవంలో నంది అవార్డుతో సన్మానించారు. అకాడమీ బాధ్యుడు, సింగర్ చోటు, అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు భువన, సినీ మ్యూజిక్ డైరెక్టర్లు సీతాల రాఘవేంద్ర, పనీర్, డైరెక్టర్ నజీర్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



నితీష్‌ను సన్మానిస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్ అర్బన్: గ్రూపు –1 పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించి మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా నియామక పత్రం అందుకున్న ఐతు నితీష్‌ను వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కాటన్ సెక్షన్‌లో సభ్యుడు ఐతు వీరేష్ (కొటెక్స్ భాగస్వామి) కుమారుడు నితీష్ గ్రూప్ –1కు ఎంపికై అదనపు కలెక్టర్‌గా నియామకం పొందడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, కోశాధికారి అల్లె సంపత్, సభ్యులు, అన్ని సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

వైద్యుల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో వైద్యులు

కాజీపేట అర్బన్: ప్రతిరోజు సైకిల్‌పై సవారీ చేస్తే గుండె సంబంధిత వ్యాధులు దరిచేరవని మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజిస్టులు పాలగిరి షఫీ, శ్రవణ్‌కుమార్ రాంపల్లి తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో వరంగల్ సైక్లిస్ట్ అసోసియేషన్ సౌజన్యంతో మెడికవర్ నుంచి నిట్ వరంగల్ వరకు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నిట్ వరంగల్ క్యాంపస్‌లో సీపీఆర్‌పై వైద్యులు అవగాహన కల్పించారు. నిట్ రిజిస్ట్రార్ మెహత, రాధారుక్మిణి, మెడికవర్ సెంటర్ హెడ్ హరినాథ్, మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటం చేసిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కొనియాడారు. నగరంలోని 55, 56వ డివిజన్లలో సుమారు రూ.3.70 కోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్‌షాపుల ద్వారా సన్నరకం బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. అనంతరం గోపాలపురం కల్లుమండవా వద్ద ఏర్పాటు చేస్తున్న పాపన్న విగ్రహానికి భూమి పూజచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షులు కొంక హరిబాబు, గడ్డం శివరాం, మణీందర్ నాథ్, మాజీ ఉపసర్పంచ్ రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బతుకమ్మ విగ్రహం ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బతుకమ్మ విగ్రహ దాత జక్క మహబూబ్‌రెడ్డి, గద్దె నిర్మాణ దాత రాజారవు స్వామిని అభినందించారు.

సంఘటిత శక్తికి ప్రతీక విజయదశమి



హన్మకొండ: విజయ దశమి ఉత్సవంలో స్వయం సేవకులు

హన్మకొండ: సంఘటిత శక్తికి ప్రతీక విజయదశమి అని ఆర్ఎస్ఎస్ వరంగల్ మహానగర్ గోష్ ప్రముఖ్ బూర్ల శశికాంత్ అన్నారు. హనుమకొండ కిషన్‌పురలోని ప్రైవేట్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ లష్కర్ బజార్ బస్తీ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శశికాంత్ ప్రధాన వక్తగా, దొడ్డ మోహన్ రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే సంఘం గొప్ప శక్తిగా ఎదిగి వందేళ్లు పూర్తి చేసుకుంటోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలను సంతోష్ రెడ్డి, రావు పద్మ, చింతల రఘుపతి, గాదె రాంబాబు పాల్గొన్నారు.

సామరస్యతతోనే దేశ పునర్నిర్మాణం

విద్యారణ్యపురి: సామాజిక సామరస్యతతోనే దేశం పునర్నిర్మాణం సాధ్యమవుతుందని కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్, కేయూ అఫైర్స్ డీన్ మామిడాల ఇస్తారి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తైన సందర్భంగా ఆర్ఎస్ఎస్ వరంగల్ కొత్తవాడ శాఖ ఆధ్వర్యంలో ఆంజేయస్వామి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

దేశ సమగ్రతే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

ఖిలా వరంగల్: దేశభక్తి, సమగ్రతే ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని ప్రచారక్ అదరణీయ కడమంచి విఘ్నేష్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖిలా వరంగల్ తూర్పుకోటలో కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో డాక్టర్ అచ్చ వరుణ్‌బాబు అధ్యక్షతన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ దేశం, ధర్మ కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని తెలిపారు.

కాజీపేట సోమిడిలో..

కాజీపేట: సంఘటిత శక్తికి ప్రతీక విజయదశమి వేడుకలని ఆర్ఎస్ఎస్ సంపర్క ప్రముఖ్ జూలపల్లి కరుణాకర్ అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడి భక్తాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గందసిరి ప్రసాద్, నగర కార్యవాహ అలువాల రాజ్‌కుమార్, సుంచు పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ర్యాలీ

మడికొండ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మడికొండ పద్మశాలి సంఘం భవనం నుంచి మడికొండ ప్రధాన వీధుల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్‌ను 1925లో విజయదశమి రోజున డాక్టర్ కేశవరావు బలీరామ్ హెడ్గేవార్ స్థాపించినట్లు ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ గుర్తుచేశారు. కార్యక్రమంలో కుందురు రాజేష్‌రెడ్డి, చిగురుపాటి వెంకటేశ్వర్లు, దువ్వ నవీన్, పిట్టల రమేష్, కొలిపాక కుమార్, కుక్కల రాజేందర్, అలువాల రాజ్‌కుమార్, అరవింద్, రాకేష్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ముగిసిన శిక్షణ



నయీంనగర్: వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గంప నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఆన్‌లైన్ – ఆఫ్‌లైన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి 6వ డివిజన్‌లో ఓ బ్యాంకెట్ హాల్‌లో రెండు రోజుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రఘు రాఘవేంద్ర స్వామిని అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్సై సతీష్, ఇంపాక్ట్ ఫౌండేషన్ సభ్యులు కె.మాధవి, కె.రామచంద్రుడు, శ్రీనివాస్, గాజుల సునీల్‌కుమార్, శ్రీరంగం జయంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించండి

న్యూశాయంపేట: స్థానిక సంస్థల ఎన్నికల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కోరారు. హనుమకొండ పార్టీ కార్యాలయంలో పార్టీ సమితి సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల చండీగఢ్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల్లో మూడో సారి జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికైన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును సత్కరించారు. కార్యక్రమంలో కె.భిక్షపతి, కరుణాకర్, శ్రీనివాస్, సదాలక్ష్మి, టి.భిక్షపతి, ఎల్లేష్, కె.లక్ష్మణ్, రాములు, ఎం.భిక్షపతి, సదానందం, వెంకట్రాజం, ఏ.శ్రీనివాస్, రవి, వీరస్వామి, సంతోష్, శంకర్ నాయక్, మనోహర్, సంజయ్, రాజు, రాజయ్య, జ్యోతి, సునీల్ పాల్గొన్నారు.